క్లుప్తంగా

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి


రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు

ఇచ్ఛాపురం రూరల్: రోజురోజుకూ చాపకింద నీరులా విజృంభిస్తున్న క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని లొద్దపుట్టిలో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి–ఆశి దాలయ్య రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్య సిబ్బందితో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు డాక్టర్ సుధానంద, డాక్టర్ శ్వేత, డాక్టర్ పాల్ మాట్లాడుతూ ఖైనీ, గుట్కా, పాన్ పరాగ్, ధూమపానంకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా స్త్రీలకు గర్భాశయం, రొమ్ము క్యాన్సర్ కణతలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆశి దాలయ్యరెడ్డి, తిప్పన నాగరాజురెడ్డి, దుక్క ఆనంద్, తేజా తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


మాట్లాడుతున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం రూరల్: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీసాల చిన్నంనాయుడు అన్నారు. పట్టణంలోని అయ్యవారిపేటలో మంగళవారం నిర్వహించిన సంకల్పం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదామని, బాల్య వివాహాలను వ్యతిరేకిద్దామని పిలుపునిచ్చారు. మహిళలపై సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెక్కలి ఎంపీపీ కుమార్తె మృతి

టెక్కలి: టెక్కలి ఎంపీపీ అట్ల సరోజనమ్మ కుమార్తె స్వర్ణకుమారి (32) మంగళవారం మృతి చెందారు. ఎల్‌ఎన్‌పేట మండలం గార్లపాడు గ్రామంలోని అత్తవారింట్లో మృతి చెందిన స్వర్ణకుమారి మృతదేహాన్ని స్వగ్రామం టెక్కలి తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. ఈ మేరకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, దళిత సంఘాల నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా బాబూరాజేంద్ర ప్రసాద్ జయంతి


రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో భారత తొలి రాష్ట్రపతి దివంగత బాబూరాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కొత్తపల్లి సుహాస్‌చంద్ మాట్లాడుతూ తొలి రాష్ట్రపతిగా రాజేంద్రప్రసాద్ ఎన్నో సంస్కరణలు రూపొందించారని, ముఖ్యంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఆయన కీలక పాత్ర వహించారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనుకూలమైన పంటలు వేయాలి


రైతులతో మాట్లాడుతున్న ఏడీ జగన్మోహనరావు

ఇచ్ఛాపురం రూరల్: రబీ సీజన్‌లో రైతులు అనుకూలమైన పంటలు వేసుకుంటే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయ ఉప సంచాలకుడు కె.జగన్మోహనరావు అన్నారు. మండపల్లి, పురుషోత్తపురం పంచాయతీల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రబీ పంటకు సంబంధించి ఇన్సూరెన్స్, ధాన్యం కొనుగోలు విధివిధానాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.భార్గవి పాల్గొన్నారు.

యంత్రం.. సాగు మంత్రం

- వరి సాగులో జోరుగా యంత్రాల వినియోగం
- తగ్గుతున్న పెట్టుబడి భారం
- ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కూలీలు


పీజీపాడులో యంత్రం సాయంతో వరి కోతలు


బెండి గేట్ వద్ద యంత్రం సాయంతో వరికోత చేస్తున్న రైతు

వజ్రపుకొత్తూరు రూరల్: వరి సాగులో రైతులు కొత్త కొత్త వంగడాలు వినియోగించడంతో పాటు వినూత్న రీతిలో పంట సాగుకు శ్రీకారం చుడుతున్నారు. దీనిలో భాగంగానే యంత్రాల వినియోగం ఏటేటా పెరుగుతూ వస్తోంది. రైతుల ఆలోచనకు తగ్గట్టుగా యంత్రాలు కుడా మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. చిన్న, సన్నకారు రైతులు మినహా మిగిలిన రైతులు యంత్రాలను కొనుగోలు చేసి వరి సాగులో జోరుగా వాటిని వినియోగిస్తున్నారు. అయితే వారి అడుగు జాడల్లోనే చిన్న, సన్నకారు రైతులు కూడా నడుస్తూ యంత్రాలను అద్దెకు తీసుకుంటూ సాగు చేస్తున్నారు. వరిసాగు ప్రారంభంలో ట్రాక్టర్లతో దమ్ములు చేయడంతో పాటు వరినాట్లు వేయడంలోనూ యంత్రాలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వరి కోతల సమయం కావడంతో యంత్రాల సాయంతో వరి కోతలను జోరుగా చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యం రాత్రింబవళ్లు పొలాల్లో బిజీబిజీగా గడుపుతూ యంత్రాల సాయంతో నూర్పులు చేపడుతున్నారు.

వినియోగంపై ఆసక్తి

సకాలంలో వర్షాలు, సాగునీరు లేకపోవడంతో పంట రాబడి ఆలస్యం అవుతుందని భావించి యంత్రాలను ఉపయోగిస్తున్నారు. అలాగే తక్కువ సమయంలో ఎక్కువ పని సాధ్యమవుతుందని, అలాగే పెట్టుబడి కుడా తగ్గుతుందని భావించి యంత్రాలపై ఆసక్తి చూపుతున్నారు. ఎకరం పంట పొలంలో సాగు చేసేందుకు కూలీలను ఉపయోగిస్తే సుమారు రూ.12 నుంచి రూ.15 వేలు ఖర్చు అవుతుంది. అదే యంత్రాలను ఉపయోగించి సాగుచేస్తే కేవలం రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరం వరి కోతకు కూలీలకు అయ్యే ఖర్చు రూ.5,500లు కాగా, అదే యంత్రం సాయంతో కోత చేస్తే రూ.2,400లు ఖర్చు అవుతుంది. అలాగే యంత్రం సాయంతో కోత, నూర్పు చేస్తే కేవలం రూ.3,600 ఖర్చు అయ్యి, నేరుగా తమ చేతికి ధాన్యం అందుతుందని దీంతో సమయం కుడా కలిసి వస్తుందని రైతులు అంటున్నారు. యంత్రాలను వినియోగించడం వలన తమకు చాలా ప్రయోజనాలు ఉన్నాయని పెట్టుబడి ఖర్చు కుడా తగ్గుతుందన్నారు.

కూలీలకు ఉపాధి కరువు

ఏళ్ల తరబడి వ్యవసాయ పనులను నమ్ముకొని జీవనోపాధి సాగిస్తున్న వ్యవసాయ కూలీలకు యంత్ర వినియోగం ఉపాధిని దూరం చేసింది. గతంలో వ్యవసాయ కూలీలపై ఆధారపడి పంట సాగు చేసే రైతులు, నేడు యంత్రాల మీద ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. దీంతో వ్యవసాయ కూలీలు స్థానికంగా ఉపాధి లేక దిక్కుతోచక వలస బాట పడుతున్నారు. కొంతమంది కూలీలు ప్రత్యామ్నాయ పనులను చూసుకుంటూ ఉపాధి సాగిస్తున్నారు. అయితే ఈ యంత్రాల వినియోగం కూలీలకు ఉపాధి దూరం చేసినా.. రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గిస్తూ ఆదాయం కలిసి వస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పెట్టుబడి తగ్గుతోంది



ప్రస్తుతం వరి కోతలను యంత్రాల సాయంతో చేస్తున్నాం. వరికోత యంత్రం ఉపయోగించడం వలస తక్కువ ఖర్చుతో అనుకున్న సమయానికి పని పూర్తవుతోంది. ఎకరం కోత, నూర్పు చేయడానికి రూ.3,600 ఖర్చు అవుతుంది. అదే కూలీలను పెట్టి కోతలు చేస్తే రూ.5 వేలు వరకు ఖర్చు అవుతుంది.

– బి.భాస్కరరావు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

సులువుగా, వేగంగా



యంత్రాల సాయంతో పంటలు సాగు చేస్తే పని సులువుగా, వేగంగా పూర్తవుతుంది. అలాగే తక్కువ సమయంతో పాటు పెట్టుబడి తక్కువ అవుతోంది. దీంతో మాకు కొంత పెట్టుబడి మిగులుతుంది. ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో యంత్రంతోనే కోతలు చేస్తున్నాం.

– టి.జగ్గారావు, వజ్రపుకొత్తూరు

బాధితులకు ఆపన్నహస్తం


ఇచ్ఛాపురం రూరల్: అన్నపూర్ణకు నగదు అందజేస్తున్న ఎంపీటీసీ ప్రేమ్‌కుమార్ యాదవ్


కవిటి: భూలక్ష్మికి సాయం అందిస్తున్న సంఘం సభ్యులు

కవిటి: మండలంలోని ఎర్రగోవిందపుట్టుగ జంక్షన్‌లో నివసిస్తున్న బుడంకాయల శ్రీనివాస్ కుటుంబానికి స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి వైశ్యసంఘం ఆపన్నహస్తమందించింది. మంగళవారం ఈ మేరకు గ్రామానికి వెళ్లి బాధితుడి భార్య భూలక్ష్మికి రూ.12,000 సాయాన్ని అందించారు. బాధితుడు బ్రెయిన్ క్యాన్సర్ సమస్యతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి కుటుంబం దీనస్థితిని గుర్తించిన సంఘం అందించిన సాయంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లోనూ తమ సంఘం తరఫున సాయం అందించేందుకు సహకరించగలమని వారు తెలిపారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన తిప్పన నారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తండ్రిని చూడడానికి వలస వెళ్లిన కొడుకు పృథ్వీ ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. దీంతో తల్లి అన్నపూర్ణ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండడంతో స్పందించిన నర్తు నరేంద్ర యువసేన సభ్యులు రూ.10 వేలు, ఎంపీటీసీ సభ్యుడు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్ రూ.10 వేలు నగదును మంగళవారం అన్నపూర్ణకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద తిప్పన దాలయ్యరెడ్డి, రత్నాల తారకేశ్వరరావు, మజ్జిదేష్, నరేంద్ర యువసేన సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం

- మందస ఎంపీపీ దానయ్య


మాట్లాడుతున్న ఎంపీపీ దానయ్య

కాశీబుగ్గ: రాష్ట్రంలోని వ్యవసాయ రంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మందస ఎంపీపీ డొక్కరి దానయ్య ఆరోపించారు. మండలంలోని బాహాడపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులకు కావాల్సిన సేవలన్నీ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందేవన్నారు. కానీ ప్రస్తుతం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. ఇంతవరకు రైతులకు రైతు భరోసా సాయం కూడా అందలేదని మండిపడ్డారు. అలాగే పండించిన ధాన్యాన్ని అమ్ముకోడానికి ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదని దుయ్యబట్టారు. ఇదే అదునుగా రైస్ మిల్లర్లు దళారులను పెట్టి తేమ శాతం ఎక్కువ ఉందని భయపెట్టి కారుచౌకగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు మేలు చేయాలని కోరారు.

5న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని హుకుంపేటలో ఈనెల 5వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదవుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ ప్రతిభ పోటీల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 63052 71092, 84640 26342 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కిడ్నీ రోగులకు మెరుగైన వైద్యం అందజేయాలి



ఇచ్ఛాపురం: సూచనలిస్తున్న జడ్జి పరేష్‌కుమార్

సోంపేట: కిడ్నీ రోగులకు మెరుగైన వైద్యం అందజేయాలని సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక సామాజిక ఆస్పత్రి ఆవరణలో కిడ్నీ రోగులకు వైద్య శిబిరం, వైద్య సిబ్బందికి న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. డయాలసిస్ బాధితులను పరామర్శించి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ కిడ్నీ రోగుల వైద్యంపై నిర్లక్ష్యం వహించవద్దని వైద్యులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము, సామాజిక ఆస్పత్రి సూపరింటెంటెంట్ టి.వెంకటేష్, ల్యాబ్ టెక్నిషియన్ శివప్రసాద్, సామాజిక ఆస్పత్రి వైద్యురాలు లతాశ్రీ, న్యాయవాది జగదీష్ పండా, లీగల్ వలంటీర్లు ఎం.ధర్మారావు, శోభాదేవి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రి సందర్శన

కాశీబుగ్గ: పలాసలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని పలాస జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, పలాస మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ యు.మాధురి పలాస బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మంగళవారం సందర్శించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో కిడ్నీ రోగులకు ఎటువంటి సేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, ఆర్‌ఎం కూన మోహనబాబు, నెఫ్రాలజిస్టు డాక్టర్ రాకేష్, బార్ అసోసియేషన్ సభ్యులు పిండి వెంకటరావు, ఫయాద్ అహ్మద్, గెద్దం అనిల్ రాజు, కోత రజనీకుమార్, రవికుమార్, చిట్టిబాబు, శ్యాం, దేవరాజు, సీసీ నారాయణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పరీక్షలు చేసుకోవాలి

ఇచ్ఛాపురం: కిడ్నీ వ్యాధితో బాధపడేవారు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి పరేష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈదుపురం, కొళిగాం సీహెచ్‌సీల వైద్యాధికారులు డా.పి.దేవేంద్ర, డా.రమ్య, డా.కల్యాణి, నెఫ్రాలజిస్టు డా.జ్యోత్స్న, మండల లీగల్ సెల్ సభ్యులు రమణయ్య, సీతయ్య, మనోజ్, కామేష్, రంగారావు, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.


కాశీబుగ్గ: మాట్లాడుతున్న జడ్జి మాధురి


సోంపేట: వైద్య శిబిరం పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాసరావు తదితరులు

ప్రమాదకరం



రోజురోజుకీ ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నా ప్రైవేట్ వాహనదారుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదని చెప్పడానికి ఈ చిత్రం నిలువెత్తు సాక్ష్యం. ప్రైవేట్ వాహనదారులు అత్యాశతో పరిమితికి మించిన లోడుతో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. ఈ వాహనం అదుపు తప్పితే ప్రమాదం తప్పదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా ప్రైవేట్ వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించి పోలీసుల కళ్ల ముందు ప్రయాణం చేస్తున్నప్పటికీ వారు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ చిత్రం సోమవారం బెండి గేట్ వద్ద సాక్షి కెమెరాకు చిక్కింది.

– వజ్రపుకొత్తూరు రూరల్

కుక్కల స్వైర విహారం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కాశీబుగ్గలో కుక్కలు బెడద అధికమైంది. క్రీడా మైదానాలు, దేవాలయాలు, పాఠశాల ఆవరణాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ దాడులు చేస్తుండడంతో పాదచారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో కుక్కల నియంత్రణ లేకపోవడంతో గుంపుగుంపులుగా తిరుగుతున్నాయి. అధికారులు స్పందించి నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

– కాశీబుగ్గ

అవగాహన ర్యాలీ



ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత అవసరమని రత్తకన్న మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.పావని అన్నారు. పాఠశాల ఆవరణలో తోటూరు యువ సూర్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. సాంకేతికతతో పాటు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.రాంబాబు, పాఠశాల సిబ్బంది రవీంద్ర, న్యాయవాదులు సీతయ్య, కృష్ణమూర్తిరెడ్డి, తులసీరావు, బైరి, ప్రేమ్, బిసాయి, ధర్మరాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


వినయ్‌కు జ్ఞాపికనందిస్తున్న హెచ్‌ఎం శివరాంప్రసాద్ తదితరులు

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని రాజపురం జెడ్పీ బాలుర పాఠశాల హెచ్‌ఎం శివరాంప్రసాద్ పాఢి అన్నారు. పాఠశాలలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించగా, ప్రథమ స్థానం సాధించిన పాఠశాలకు చెందిన పి.వినయ్‌ను మంగళవారం అభినందించారు. జిల్లాలోని 100 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 170 మంది బాలబాలికలు పాల్గొన్న ఈ టాలెంట్ టెస్ట్‌లో వినయ్ అత్యధిక మార్కులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి విజయంలో కీలకపాత్ర పోషించిన ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్ రవికుమార్‌ను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులు దేవుడితో సమానం


ఇచ్ఛాపురం: దివ్యాంగ చిన్నారులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎంఈవో అప్పారావు


కంచిలి: ప్రత్యేక అవసరాల చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న దుద్ది శ్రీనివాసరావు తదితరులు


సోంపేట: దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో జోరాడు


నందిగాం: ర్యాలీ చేస్తున్న దివ్యాంగ విద్యార్థులు, అధికారులు


టెక్కలి రూరల్: దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


పలాస: దివ్యాంగ పిల్లలకు టిఫిన్ బాక్సులు అందజేస్తున్న అధికారులు


సంతబొమ్మాళి: దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో చిన్నవాడు తదితరులు

దివ్యాంగులు దేవుడితో సమానమని వక్తలు అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) దినోత్సవాన్ని అన్ని మండల కేంద్రాల్లోని భవిత కేంద్రాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని దివ్యాంగుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ప్రతిభకు వైకల్యం అడ్డు కారాదన్న స్ఫూర్తిని విభిన్న ప్రతిభావంతుల్లో నింపాలన్నారు. అనంతరం పలు క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్